

# నేను రావచ్చునా?

జి.శారద

శెలవులకు రమ్మని మా పిన్ని రెండు, మూడు సంవత్సరాల నుండి వ్రాస్తుంటే యీ సంవత్సరం డిగ్రీకోర్సు పూర్తి చేసిన సంతోషంలో, తెలిసిన వాళ్ళతో కలిసి పిన్ని దగ్గరకు హైదరాబాదు వెళ్ళేను. పదిరోజులు చూడవలిసిన స్థలాలూ, పరిచయమున్న వాళ్ళ యిళ్ళూ నిర్విరామంగా తిరిగాము. ఆ రోజు పిన్ని బట్టలుతుకుతుంటే నేను సాయం చేస్తున్నాను. కాలింగ్ బెల్ వినిపించి వెళ్ళాను. ఎదురుగా ఎవరో పని కుర్రాడిలా ఉన్నాడు. 'ఈ రోజు మధ్యాహ్నం మా అమ్మ గారు రావాలనుకుంటున్నారు. తీరికగా ఉంటారా? ఎక్కడికైనా వెళ్తారా? అని అడిగి రమ్మన్నారండి' అన్నాడు. 'మీ అమ్మగారంటే?' 'ఇంజనీరు రామారావుగారి భార్యగారండి.' నేను లోపలికి వెళ్ళి పిన్నికా సంగతి చెప్పాను. 'ముందుగా చెప్పేక కూడా ఎక్కడకి వెళ్తామూ, ఉంటాం రమ్మను.' అంది. 'తప్పకుండా రమ్మన్నార'ని అతనికి చెప్పి తలుపువేసి లోపలకు వెళ్ళాను. 'ఈవిడకు యిదో ఫేషను. ముందుగా కబురు పెడ్తుంది. చచ్చినట్లు టిఫిన్లవీ సిద్ధం చేయాలి. ఇల్లు సర్దుకోవాలి. సరే... మైసూర్‌పాకు, బంగాళా దుంపబజ్జీ చేసి టీ యిద్దామా?' అంది పిన్ని.

'అదేమిటి పిన్నీ! అలా ముందుగా తెలియ చేయడం ఎంత మంచి అలవాటో తెలుసా! వస్తారని తెలిస్తే తప్పనిసరిగా టిఫిన్లవీ తయారు చేసి పెట్టాలనుకోవడం మన పొరపాటు. ముందుగా కబురు చేయడంవల్ల ఆ టైముకు మన పని ముగించుకోవచ్చు. మనం పని చేస్తున్నప్పుడు ఎవరైనా వస్తే వాళ్ళను కూర్చోబెట్టి మన పని పూర్తి చేసుకోడం బావుండదు కదా! ఉదాహరణకు యిప్పుడు అతన్ని పంపకుండా ఆవిడే వచ్చేరనుకో! బట్టలలా ఉంచేసి మనం వెళ్ళి కూర్చుంటాం. ఆమె మనకు యిష్టమైన వ్యక్తి అయితే ఆమె ఉన్నంతసేపూ వాటి సంగతి గుర్తురాదు. (యిష్టం లేకపోతే మనకు ముళ్ళ మీద ఉన్నట్లే వుంటుంది.) ఆమె వెళ్తానని ఒకటికి, రెండుసార్లు లేచినా ఆపేస్తాం. అలా ఆమె ఒక గంట, గంటన్నర కానీ కూర్చుంటే ఎండ కాస్తా పోతుంది. బట్టలారవు. బయట ఉంచేయడానికి భయం. లోపల ఆరవేయడానికి వీలుండదు. ఆమె రాకుండా ఉంటే యీ చికాకు ఉండేది కాదు అనిపిస్తుంది. అవునా?

ఒక్కోసారి సాయంకాలం మనం వంట మొదలుపెట్టబోయే సమయంలో వస్తారు కొందరు. పనంతా చేసుకుని వస్తారు కనుక వాళ్ళు నిదానంగా కబుర్లు చెబుతూ కూర్చుంటారు. ఆఖరుకు వాళ్ళను సాగనంపి వంట మొదలు పెట్టేసరికి ఆకలని గోల చేసేవారొకరైతే, ఏ కుర్చీలోనో పడి నిద్ర పోయేవారొకరు. ఎక్కడలేని విసుగూ వస్తుంది మనకు. 'సరిగ్గా సినిమాకు బయలుదేరేటప్పుడు వచ్చారు. యింకేం సినిమా?' అనిపిస్తుంది– ఒక్కొక్కసారి. వచ్చేవాళ్ళు ముందుగా చెప్పివస్తే మనకాబాధ ఉండదు. వంట ముందుగా చేసుకోవచ్చు. లేకపోతే ఏర్పాట్లు చేసుకొని వాళ్ళు వెళ్ళాక చకచకా పూర్తి చేసుకోవచ్చు. వచ్చిన వాళ్ళ ఎదుట సిగ్గుపడుతూ కూర్చున్నట్లుగా కాకుండా శుభ్రమైన అవతారంలో కూర్చుని ప్రశాంతంగా విరామంగా మాట్లాడుకోవచ్చు. 'తీరికగా ఉంటారా, ఎక్కడికైనా వెళ్తారా' అని అడగడంలో ఆవిడ అంతర్యం 'నేను రావచ్చునా?' అని.

మొన్న ఏమయిందీ! రెండు బస్సులు మారి సనత్‌నగర్ వెళ్ళామా! మీ ఆడబిడ్డ లేదు. తిరిగి వచ్చేటప్పుడు నువే అన్నావా, 'ఉత్తపుణ్యానికి యింతదూరం వచ్చామంటే ప్రాణం ఉసూరు మంటున్నది కదూ!' అని. అదే ముందుగా ఒక కార్డు వ్రాసో, ఆయన ఆఫీసుకి చిన్నాన్నగారితో ఫోను చేయించో వెళ్తే మనకాశ్రమ తప్పేది.



కాదంటావా చెప్పు! విదేశీయులు, ఆఖరుకు స్వంత తల్లిదండ్రుల యింటికి వెళ్తున్నాసరే ముందు అడిగి కాని వెళ్ళరు. మనం అర్థం లేనివి అనుకరిస్తున్నాం; అటువంటివి మాత్రం విస్మరిస్తున్నాం. ఎవరైనా అలా ఆచరిస్తే విమర్శిస్తున్నాం!' అనేశాను – పిన్నితో నాకున్న చనువుకొద్దీ.

'అంతదూరం ఎప్పుడూ ఆలోచించలేదే! అవును ముందుగా చెప్పి వెళ్తే చాలా సౌకర్యాలున్నాయి వాళ్ళకూ, వీళ్ళకూ కూడా!' అని పిన్ని ఒప్పేసుకుంది.

'అదేకాదు పిన్నీ! ప్రస్తుతం యింట్లో పంచదార, నెయ్యి ఉందని మైసూర్‌పాక్ చేస్తానంటున్నావు. ఫస్టుకు జీతమూ, సమయానికి రేషనూ రాకపోతే గడవని పరిస్థితి మన మధ్య తరగతివారిది. ఎందుకు అనవసరంగా ఆర్భాటం చేయడం చెప్పు!' అన్నాను.

'ఇంజనీరు భార్య కదా, ఆమాత్రం చేయక పోతే ఎలా?'

'మన తాహతునుబట్టి మనం నడచుకోవాలి గానీ అవతలి వాళ్ళ హోదా ననుసరించి కాదు పిన్నీ! ఈ రోజు సాయంకాలం స్కూలు నుండి వచ్చే పిల్లలకు ఉప్మా చేద్దామనుకున్నావు కదా! అదే పెట్టి టీ యివ్వు. ఇలా ఎవరో ఒకరు వచ్చేరని హడావుడిపడుతూ ఖర్చుపెట్టుకోవడం, నెలాఖరుకు యిబ్బందిపడటం, అప్పులు చేయడం ఎందుకు? మన ఆడంబరాలకోసం పిల్లల బంగారు భవిష్యత్తును బలి చేయడం భావ్యంగా ఉంటుందంటావా? చెప్పు పిన్నీ!' అన్నాను.

'ఆడపిల్లలకు పెద్ద చదువు లెందుకంటారు కొందరు. నీకూ, నాకూ తేడా చూశావా? మన కన్నా పిల్లలు వాస్తవానికి దగ్గరగా ఉంటున్నారు.' అన్నారు — ఆ మధ్య ఒకసారి మీ చిన్నాన్న. నిజమేననిపిస్తుంది సుమా! నాలుగు జీడుపలుకులు ఎక్కువ వేసి ఉప్మాయే పెడదాం. కానీ కాస్త ముందు గది అదీ సర్దమ్మా! స్కూలుకు వెళ్ళే పిల్లలు అన్నీ చెల్లాచెదరు చేసి పోయారు' అంది మా పిన్ని.

ఆత్మగౌరవం, ఎదుటివారి ఎడల మన్నన ప్రతిఫలించే మాట 'నేను రావచ్చునా?'. పిన్ని చెప్పిన పని చేసేసి ఆ వచ్చే వ్యక్తి పరిచయ భాగ్యం కలిగే క్షణాలకోసం నిరీక్షించడం మొదలు పెట్టాను. □